క్లుప్తంగా

అదీప్‌రాజ్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం



లంకెలపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న వార్డు ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు

అగనంపూడి: పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడిని గెలిపించాలని కోరుతూ 79వ వార్డు లంకెలపాలెంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీసీ కాలనీ, కరణం దొడ్డి ప్రాంతాల్లో నాయకులు, మహిళలు కరపత్రాలు పంపిణీ చేసి, వైఎస్సార్‌సీపీకి ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుందరపు అప్పారావు, కర్రి నరసింగరావు, నెల్లి కన్నబాబు, ఎలమర్తి వెంకటరావు, కాతా నూకేష్, దాసరి ప్రకాష్, నెల్లి అప్పారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెందుర్తి: చినముషిడివాడ 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత పనుల నిమిత్తం పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈపీడీసీఎల్ జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీబీసీ కాలనీ, ద్రోణంరాజునగర్, చినముషిడివాడ, పాతూరు, ప్రసాద్‌నగర్, సత్యనగర్, శారదాపీఠం, చిన్నయ్యకాలనీ, అశోక్‌నగర్, సాయినగర్ ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

పురుషోత్తపురం ఫీడర్ పరిధిలో..
కృష్ణరాయపురం, టీచర్స్ కాలనీ, ఎన్ఏడీ లేఅవుట్, పురుషోత్తపురం, శానాతివానిపాలెం, వరలక్ష్మినగర్, సంతోష్‌నగర్‌లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు.

సతివానిపాలెం సబ్ స్టేషన్ పరిధిలో..
సతివానిపాలెం, అహ్మద్‌నగర్, తులసి గార్డెన్స్, సీతారామం గార్డెన్స్ ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ ఉండదని ఈఈ పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పరవాడ: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పలు చోట్ల విద్యుత్ పరమైన సమస్యలు పరిష్కరించే నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. తిక్కవానిపాలెం, దలాయిపాలెం, రావాడ, పరవాడ, భర్నికం, పి.బోనంగి, ఇండస్ట్రియల్ పార్క్, గొర్లివానిపాలెం, దేశపాత్రునిపాలెం, జాజులవానిపాలెం, కలపాక, వెన్నలపాలెం గ్రామ పంచాయతీల్లో విద్యుత్ సరఫరా ఉండబోదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణ కోరారు.

మద్యంతో ఇద్దరి అరెస్ట్

సబ్బవరం: అక్రమంగా మద్యం కలిగిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ పిన్నింటి రమణ గురువారం తెలిపారు. మండలంలోని అంతకాపల్లికి చెందని శ్రీకాంత్‌ను 8 మద్యం బాటిళ్లతో ..అలాగే గుల్లేపల్లిలో వడిశల శ్రీను తన కిరాణా షాపులో మద్యం విక్రయిస్తుండగా గురువారం పట్టుకున్నట్లు తెలిపారు.అతని వద్ద నుంచి 6 మద్యం సీసాలు స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో హెల్పర్ మృతి



మృతుడు శివన్నారాయణ

మునగపాక: విధి నిర్వహణలో విద్యుత్ హెల్పర్ గురువారం ఉదయం మృత్యువాతకు గురయ్యాడు. ఇంటి పెద్ద దిక్కుగా నిలిచిన హెల్పర్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. పెందుర్తి మండలం వేపగుంటకు చెందిన పీతల శివన్నారాయణ(42) 15 సంవత్సరాలు గా మునగపాక మండలం చూచుకొండలో స్థానికంగా విద్యుత్తు హెల్పర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇక్కడే సొంతిల్లు నిర్మించుకుని కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. గురువారం ఉదయం 9 గంటల ప్రాంతంలో విద్యుత్ స్తంభంపై పనులు చేపడుతుండగా, ఒక్కసారిగా షాక్‌కు గురై కింద పడిపోయాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ విష యం తెలుసుకున్న ఎస్‌ఐ పి.ప్రసాదరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అందుబాటులో ఉంటా.. ఆశీర్వదించండి



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అభిమానులు, నాయకులు



తమకు ఓటు వేయాలని మహిళను కోరుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- వెదుళ్ల నరవలో ఎన్నికల ప్రచారం

సబ్బవరం: నిత్యం మీ అందరికీ అందుబాటులో ఉండే తనను మరోసారి ఎమ్మెల్యేగా దీవించాలని పెందుర్తి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కోరారు. జీవీఎంసీ 88వ వార్డు వెదుళ్ల నరవలో గురువారం సాయంత్రం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. వెదుళ్లనరవ,వెదుళ్లనరవ బీసీ కాలనీ,వెదుళ్లనరవ కొత్తూరు,కొత్తూరు కాలనీ,ఇంద్రానగర్‌లో నిర్వహించిన ప్రచారంలో అదీప్‌రాజ్‌కు అడుగడుగునా పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు ఘన స్వాగతం పలికారు.

మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు ఇంటి వద్ద ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు మహిళలు హారతులు ఇచ్చి ఆప్యాయంగా స్వాగతం పలికారు. కోలాటం బృందాలు,పార్టీ జెండాలతో ప్రచారం హోరెత్తించారు. అదీప్‌రాజ్ ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో చేసిన కార్యక్రమాలను వివరించి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా పథకాలు అందించి ప్రతి ఇంటికీ ధైర్యంగా వెళ్లి ఓట్లు అడిగే అవకాశాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కల్పించారన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఎలా మోసం చేశారో వివరించారు. నిబద్ధతతో పనిచేస్తూ ప్రజల మనసులు గెలుచుకున్న ముఖ్యమంత్రి వైస్ జగన్ మోహన్‌రెడ్డి వెంట ప్రతి ఒక్కరూ నడిచి మే 13 న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను.. ఎంపీగా బూడి ముత్యాలనాయుడును గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గండి రవి కుమార్, వార్డు ఇన్‌చార్జి గనిరెడ్డి మహాలక్ష్మినాయుడు,మాజీ కార్పొరేటర్ చొప్ప నాగరాజు,సర్వసిద్ధి బోరయ్య, బొట్టా ముత్యాలరావు,చట్టి తాతారావు,చొప్ప అప్పలనాయుడు,శేఖరమంత్రి శ్రీనివాసరావు,దాడి నూకరాజు,కిల్లాని అప్పలరాజు,మాడిసి సత్యనారాయణ, పల్ల చిన్నారావు,చట్టి అప్పలరాజు,బొట్టా బంగారు రాజు,చొప్ప రాజు, శ్రీను,వి. తాతారావు,డి. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

50 కుటుంబాల చేరిక

వెదుళ్లనరవలో టీడీపీ, జనసేనకు చెందిన సుమారు 50 కుటుంబాల వారు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో సీహెచ్ నాయుడు,పి. వెంకటరావు, కొండలరావు, బొడ్డేటి సంతోష్ కుమార్,వి. అశోక్,పి. రవికుమార్,ఎం. సత్తిబాబు,వి. రాము యాదవ్,వి. ప్రసాద్ యాదవ్,ఎస్. అప్పలస్వామి, జీవీ రమణ,ఎన్. సింహాచలం తదితరులు ఉన్నారు.



పార్టీలోకి కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

20 మంది .. 33 సెట్ల నామినేషన్లు

- ఆఖరి రోజు ఆరు నామినేషన్లు
- నేడు నామినేషన్ల స్క్రూటినీ



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పెందుర్తి ఆర్వో కార్యాలయం

పెందుర్తి: సార్వత్రిక ఎన్నికల్లో తొలి ఘట్టం ముగిసింది. నామినేషన్ల స్వీకరణకు ఆఖరి రోజైన గురువారం పెందుర్తి నియోజకవర్గానికి మొత్తం 6 నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్‌సీపీ తరఫున అన్నంరెడ్డి అదీప్‌రాజ్, అన్నంరెడ్డి శిరీష అదనపు సెట్ల నామినేషన్లు వేశారు. నవరంగ కాంగ్రెస్ పార్టీ తరఫున పి.రమేష్‌నాయుడు, ఇండిపెండెంట్లుగా బంతికోరు గోవిందరాజు, గుంటూరు వెంకట నరసింహరావు, షేక్ షఫీ ఉల్లా నామినేషన్లు వేశారు. మొత్తంగా 20 మంది అభ్యర్థులు 33 సెట్ల నామినేషన్లు వేసినట్లు రిటర్నింగ్ అధికారి శేష శైలజ వెల్లడించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నామినేషన్ల ప్రక్రియ ముగిసిందని ఆర్వో ప్రకటించారు. శుక్రవారం నామినేషన్ల స్క్రూటినీ జరుగుతుందని చెప్పారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ఈ నెల 29 అని వెల్లడించారు. అదే రోజు పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థుల తుది జాబితా వెల్లడిస్తామని పేర్కొన్నారు. పెందుర్తి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తరఫున బీఫాంతో కూడిన రెండు సెట్ల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి శేష శైలజకు గురువారం ఆ పార్టీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో అదీప్‌రాజ్ మాతృమూర్తి అన్నంరెడ్డి రామలక్ష్మి, సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బైలపూడి భగవాన్ జయరాం, 95 వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, 96 వార్డు నాయకుడు దాడి రమణ పాల్గొన్నారు.

నామినేషన్ల వివరాలు

1. అన్నంరెడ్డి అదీప్‌రాజ్	వైఎస్సార్‌సీపీ	3 సెట్లు
2. అన్నంరెడ్డి శిరీష	వైఎస్సార్‌సీపీ	1 సెట్
3. పరిది భగత్	కాంగ్రెస్	4 సెట్‌లు
4. పంచకర్ల రమేష్‌బాబు	జనసేన	4 సెట్‌లు
5. పంచకర్ల మహాలక్ష్మి	జనసేన	2 సెట్‌లు
6. పంచకర్ల వెంకటేశ్వరరావు	జనసేన	1 సెట్
7. బంగారి రమణ	బీఎస్పీ	2 సెట్‌లు
8. కన్నెపల్లి మహాదేవ్ కల్యాణ్ శ్రీకాంత్	జై భారత్ జాతీయ పార్టీ	1 సెట్
9. ఈత రోజా	పిరమిడ్ పార్టీ	2 సెట్‌లు
10. బోలెం వెంకట మురళీమోహన్	సమాజ్‌వాది పార్టీ	1 సెట్
11. ఈ.వెంకటరమణ	నేషనలిస్ట్ జనశక్తి పార్టీ	1 సెట్
12. పి.రమేష్‌నాయుడు,	నవరంగ్ కాంగ్రెస్ పార్టీ	1 సెట్
13. షేక్ షఫీ ఉల్లా	ఇండిపెండెంట్	1 సెట్
14. ఆదారి నాగరాజు	ఇండిపెండెంట్	1 సెట్
15. గుంటూరు వెంకట నరసింహరావు	ఇండిపెండెంట్	2 సెట్‌లు
16. గుంటూరు సాయి ప్రియ	ఇండిపెండెంట్	1 సెట్
17. కూండ్రపు సన్యాసిరావు	ఇండిపెండెంట్	1 సెట్
18. పొన్నాడ అప్పలనాయుడు	ఇండిపెండెంట్	1 సెట్
19. వడ్డాది ఉదయ్‌కుమార్	ఇండిపెండెంట్	1 సెట్
20. బంతికోరు గోవిందరాజు	ఇండిపెండెంట్	1 సెట్

రాచబాట

- గ్రామీణ రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి
- పలు గ్రామాల్లో బీటీ రోడ్ల ఏర్పాటు
- కష్టాలు తీరాయని హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



పరవాడ-భర్నికం గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన బీటీ రోడ్డు



వాడచీపురుపల్లి-ఇస్సన్నపేట గ్రామాల మధ్య నిర్మించిన బీటీ రోడ్డు



పరవాడ-ఎన్‌హెచ్-5 వరకు నిర్మించిన బీటీ రోడ్డు

పరవాడ: గత ప్రభుత్వ హయాంలో పరవాడ-తానాం రోడ్డు, పరవాడ-భర్నికం రోడ్డు, వాడచీపురుపల్లి-ఇస్సన్నపేట రహదారులపై ప్రయాణానికి నిత్యం నరక యాతన పడేవారు. అయా రోడ్లపై భయం భయంగా ప్రయాణం సాగించే వారు. నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు, వాహనచోదకులు రాకపోకలు సాగించే రోడ్లను అభివృద్ధి చేయాలని అప్పటి టీడీపీ ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా ఆలకించే నాధుడు లేక గుంతల రోడ్లతోనే నరకయాతన అనుభవించారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటుతో తీరిన కష్టాలు

ఇంతలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లను అభివృద్ధి చేయడానికి చర్యలు చేపట్టింది. దీంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

➡ పరవాడ-ఎన్‌హెచ్-5 రహదారి అభివృద్ధికి నోచుకోకపోవడంతో పరవాడ, తానాం, తాడి గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడేవారు. ప్రజల ఇబ్బందులను గుర్తించిన పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అధికారులతో సంప్రదించి పీఎంజీఎస్‌వై గ్రాంటు ద్వారా రూ.2 కోట్లు మంజూరు చేయించి రహదారిని అద్దంలా అభివృద్ధి చేయించారు. దీంతో చీకట్లో కూడా రయ్‌రయ్ మంటూ పరుగులు తీస్తున్నారు.

➡ చిన్నపాటి వర్షం పడితే చాలు వాడచీపురుపల్లి-ఇస్సన్నపేట రహదారి బురదమయంగా మారడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయేవి. ఇలా ఏళ్ల తరబడి ఇక్కడి ప్రజలు అవస్థలు పడుతుండేవారు. గ్రామానికి పక్కా రోడ్డు నిర్మించాలని గత ప్రభుత్వానికి విన్నవించినా ఫలితం లేకపోయింది. అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్ అండ్ బీ నిధులు రూ.82 లక్షలతో ఇస్సన్నపేట రోడ్డును బీటీ రోడ్డుగా అభివృద్ధి చేసింది.

➡ పరవాడ-భర్నికం వరకు ఏర్పాటు చేసిన బీటీ రోడ్డు విస్తరణకు నోచుకోకపోవడం, రోడ్డంత గుంతలమయం కావడంతో అనేక గ్రామాల ప్రజలు నిత్యం అవస్థలు పడుతుండేవారు. మండల ప్రజలకు అనకాపల్లి జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఈ రహదారే పెద్ద దిక్కు. రోడ్డు పావడంతో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను భర్నికం సర్పంచ్ పూజాశేఖర్ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఆర్ అండ్ బీ గ్రాంటు నుంచి రూ.60 లక్షలు మంజూరు చేయించి బీటీ రోడ్డుగా అభివృద్ధి చేయడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

కష్టాలు గట్టెక్కాయి



గతంలో భర్నికం నుంచి పరవాడ వారపు సంతకు వెళ్లాలంటే భయపడేవారం. గుంతల రహదారితో అష్టకష్టాలు పడేవాళ్లం. రోడ్డును బీటీరోడ్డుగా అభివృద్ధి చేయడంతో ప్రయాణం నిశ్చింతగా సాగిపోతుంది. కష్టాలు గట్టెక్కాయి.

– పార్వతి, భర్నికం

ఎమ్మెల్యే స్పందించారు



మాది వ్యవసాయ కుటుంబం. మేం పండించే కూరగాయలు పంట ఫలసాయాలు పట్టణ ప్రాంతాలకు తరలించి అమ్ముకోవాలంటే గ్రామానికి సరైన రోడ్డు మార్గం ఉండేదికాదు. రోడ్డు అధ్వానంగా ఉండడంతో నానా అవస్థలు పడేవాళ్లం. సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మా గ్రామానికి తారు రోడ్డు వేయించి అవస్థలు తొలగించారు. మా ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు కృతజ్ఞతలు.

– రాజులమ్మ, ఇస్సన్నపేట

సౌకర్యంగా ఉంది



పరవాడ-ఎన్‌హెచ్-5 వరకు రూ.2 కోట్లతో నిర్మించిన తారు రోడ్డు ప్రజలకు సౌకర్యవంతంగా ఉంది. గతంలో పరవాడ, సాలాపువానిపాలెం వెళ్లాలన్న ఇబ్బందులు పడేవాళ్లం. రోడ్డు వేసిన తర్వాత ప్రయాణం సుఖమయంగా ఉంది. జగనన్న ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యావాధాలు.

– శ్రీనివాసరావు, తానాం

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అజయ్‌రాజ్



93వ వార్డులో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న అజయ్‌రాజ్

సింహాచలం: వైఎస్సార్‌సీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని.. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని వైఎస్సార్‌సీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్ కోరారు. 93వవార్డు పరిధిలోని కృష్ణానగర్, విరాట్ నగర్‌లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 93వవార్డు ఇన్‌చార్జి దాసరి అన్నపూర్ణ, నాయకులు దాసరి సత్తిబాబు, బండి సత్తిబాబు, జిలాని, రమేష్, బుద్దా శివాజీ, కాంతం పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమంతో ‘ఉక్కు’ పరిరక్షణ

అగనంపూడి: ప్రజా ఉద్యమాలతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, శ్రీనివాసరావు అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో 1169వ రోజు రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. కొన్ని ప్రధాన రాజకీయ పార్టీలు విశాఖ ఉక్కు పరిరక్షణ విషయంలో సవతి ప్రేమ ఒలకబోస్తున్నాయన్నారు. కేంద్రానికి కొమ్ము కాస్తుండడం వల్లే విశాఖ ఉక్కుకు ఈ దుస్థితి కలిగిందని ఆరోపించారు. సొంత గనులు కేటాయించడం ద్వారా స్టీల్‌ప్లాంట్‌కు పూర్వ వైభవం వస్తుందని, ఈ దిశగా అన్ని రాజకీయ పార్టీలు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

జనరల్ స్టోర్‌లో అగ్ని ప్రమాదం

రూ.10 లక్షల ఆస్తినష్టం



అగ్ని ప్రమాదం సంభవించిన దుకాణం ఇదే

పరవాడ: పరవాడ సంతబయలు ప్రాంతంలో ఉన్న శ్రీసాయిరాం జనరల్ స్టోర్‌లో గురువారం తెల్లవారు జామున అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో దుకాణంలో ఉన్న సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదానికి సంబంధించి వీఆర్వో వెంకటేశ్వరరావు అందించిన వివరాలిలా ఉన్నాయి... గ్రామానికి చెందిన తేలు చలపతిరావుకు చెందిన సాయిరాం జనరల్ స్టోర్‌లో గురువారం తెల్లవారు జాము 3.30 గంటల ప్రాంతంలో అగ్ని కీలలు రావడం స్థానికులు గుర్తించి దుకాణ యజమానికి సమాచారం అందించారు. తాను వచ్చే సరికే దుకాణంలో భద్రపర్చిన పూజా సామగ్రి, కొత్త దుస్తులు, విద్యుత్ సామగ్రి పూర్తిగా మంటలకు కాలిబూడిదయ్యాయని చలపతిరావు వాపోయాడు. ఈ మెటీరియల్ విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని బాధితుడు చలపతిరావు చెప్పారు. ఆ స్టేట్‌మెంటును రెవెన్యూ అధికారికి సమర్పించినట్టు వీఆర్వో వెంకటేశ్వర్రావు తెలిపారు. అగ్ని ప్రమాదం సమాచారం అందుకున్న రాంకీ, ఎన్టీపీసీ అగ్నిమాపక శకటాలు ప్రమాద స్థలికి చేరుకొని మంటలను అదుపు చేశారు. షార్టు సర్క్యూట్ వల్ల ప్రమాదం సంభవించి ఉంటుందని భావిస్తున్నారు. దుకాణంలో అగ్నిప్రమాదం జరగడం రెండో సారని వీఆర్వో తెలిపారు.

ఘనంగా గ్రామ దేవతల పండగలు



దుర్గమాంబను దర్శించుకున్న సర్పంచ్ అప్పారావు దంపతులు, భక్తులు



మరిడిమాంబను దర్శించుకున్న గ్రామ పెద్దలు

పరవాడ: మండలంలోని వెన్నలపాలెం, రావాడ శివారు జల్లెలపాలెం గ్రామాల్లో కొలువుదీరిన దుర్గమాంబ, మరిడిమాంబ అమ్మవార్ల పండగలను ఆయా గ్రామాల ప్రజలు గురువారం అట్టహాసంగా నిర్వహించారు. వెన్నలపాలెంలో కొలువుదీరిన దుర్గమాంబను సర్పంచ్ వెన్నల అప్పారావు దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ఉప సర్పంచ్ వెన్నల సన్యాసిరావు, పైల రేగారావు, పైల సత్యనారాయణ, ఎం.ఎం.నాయుడు, సింహాద్రి తదితరులు దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆటలు, కోలాట పోటీల్లో గెలుపొందిన విజేతలకు సర్పంచ్ అప్పారావు బహుమతులు అందజేశారు. మధ్యాహ్నం నిర్వహించిన భారీ అన్నసమారాధనలో భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు. రాత్రికి డప్పులు, చిడతలు, తప్పెటగుళ్ల, కోలాటాలతో అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించి భారీ బాణ సంచా కాల్పుల నడుమ అనుపు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

➡ రావాడ శివారు జల్లెలపాలెం గ్రామంలో వెలసిన మరిడిమాంబ పండగను ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. మరిడిమాంబను మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, పి.ప్రసాద్, ఎం.అప్పలనాయుడు, కన్నూరు వెంకటరమణ, ఎం.ఎస్.నాయుడు, వియ్యపుచిన్న, మేడిశెట్టి మాణిక్యం పలువురు నాయకులు దర్శించుకున్నారు. తాగునీరు, మజ్జిగ, ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు. అమ్మవారి అనుపుమహోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు.

‘పోర్టు యాజమాన్యం కుట్రలను ఐక్యంగా తిప్పికొట్టాలి’



గంగవరం పోర్టు గేటు వద్ద బైఠాయించిన కార్మికులు

పెదగంట్యాడ: కార్మికులను బెదిరించేందుకు గంగవరం పోర్టు యాజమాన్యం చేస్తున్న ప్రయత్నాలను కార్మికులంతా ఐక్యంగా తిప్పి కొట్టాలని గంగవరం పోర్టు నిర్వాసిత సంఘ నాయకులు అన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం 15 రోజులుగా గంగవరం పోర్టు గేటు వద్ద కార్మికులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోర్టు యాజమాన్యం సమ్మెలో ఉన్న కార్మికులందరికీ వ్యక్తిగత నోటీసులు జారీ చేసింది. ముందస్తు సమాచారం లేకుండా సమ్మె చేయడంపై వివరణ ఇవ్వాలని ఆ నోటీసులో కోరింది. దీంతో కార్మికులంతా ఆందోళన చెందారు. అయినా, వారంతా పట్టు విడువలేదు. గురువారం కూడా కుటుంబాలతో కలసి పోర్టు గేటు వద్ద బైఠాయించారు. యాజమాన్యం తీరు మార్చుకోకపోతే భవిష్యత్తులో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తమకు నెలకు రూ.36వేలు వేతనాలు ఇవ్వాలని, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు.

మహిళల ఉన్నతితోనే ప్రగతి

ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్‌భక్షి



శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న గిరిధర్‌భక్షి

పరవాడ: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినపుడే ప్రగతి సాధ్యపడుతుందని విశాఖ ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్‌భక్షి అన్నారు. రాంకీ ఫౌండేషన్ సహకారంతో శ్రేయ ఫౌండేషన్ నిర్వహించిన కుట్టు శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతీ మహిళలో అంతర్గతంగా కొన్ని ప్రత్యేక నైపుణ్యాలు ఉంటాయన్నారు. వాటిని వెలుగులోకి తెచ్చి ప్రోత్సహించడం ద్వారా ఆయా కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయని గిరిధర్‌భక్షి అన్నారు. రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ డాక్టరు కె.శ్రీకాంత్ మాట్లాడుతూ భార్య భర్తలు కొంత ఆదాయాన్ని పోగు చేసినపుడే కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడి జీవన ప్రమాణాలు పెరుగుదలకు దోహదపడతాయన్నారు. 6 నెలల పాటు 60 మంది మహిళలకు రెండు బ్యాచ్‌లుగా కుట్టు శిక్షణ కల్పించడం జరిగిందన్నారు. శిక్షణ పొందిన మహిళలకు వివిధ సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఫౌండేషన్ కృషి చేస్తుందని డాక్టర్ శ్రీకాంత్ హామీ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసిన మహిళలకు అతిథులు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీనివాస్, రాజేశ్వరి, శ్రియ పాల్గొన్నారు.